## తిరుమలలో సంకీర్తనల ఆలాపన



తిరుమలలో సంకీర్తనల ఆలాపనకు హాజరైన ఉత్తనూర్ భజన మండలి సభ్యులు

అయిజ, నవంబర్ 7 : మండలంలోని ఉత్తనూర్ గ్రామానికి చెందిన ధన్వంతరి వేంకటేశ్వరస్వామి భజన మండలి బృందం తిరుమలలో సంకీర్తనలు ఆలపించారు. మంగళవారం తిరుమల తిరుపతి దేవస్థానం ఆహ్వానం మేరకు తిరుమలకు చేరుకున్న భజన మండలి బృందం తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖండ హరినామ సంకీర్తనలు ఆలపించి దేవస్థాన అధికారులచే ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులు సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భజన బృందం సభ్యులు తిరుమలేశ్, వసూరప్ప, లక్ష్మన్న, ఉత్తనూరప్ప, రామాంజనేయులు, శ్రీను, రాముడు, వీరేశ్ పరుశరాముడు, రవి తదితరులు పాల్గొన్నారు.

## 10న మండల సర్వసభ్య సమావేశం

ఇటిక్యాల, నవంబర్ 7 : మండలంలోని సర్వసభ్య సమావేశం ఈ నెల 10న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాఘవ తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు నివేదికలతో హాజరుకావాలని సూచించారు. జెడ్పీటీసీతోపాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

## చల్లాను విమర్శించే స్థాయి నీదికాదు రేవంత్

వడ్డేపల్లి, నవంబర్ 7 : పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని ఉద్దేశించి మట్లాడిన మాటలు సరికాదని బీఆర్‌ఎస్వీ పాలమూరు యూనివర్సిటీ విద్యార్థి విభాగం ఇన్‌చార్జి భరత్‌బాబు మంగళవారం ప్రకటనలో తెలిపారు. శాంతినగర్‌లో జరిగిన కాంగ్రెస్ సభలో చల్లాను విమర్శించే స్థాయి నీదికాదన్నారు. పార్టీలు మారాడని చల్లాను అంటున్నావు మరి నీవు పార్టీలు మారలేదా, డబ్బుల మూటలతో దొరకలేదా, కాంగ్రెస్ బీఫారాలు అమ్ముకానికి పెట్టలేదా అని ప్రశ్నించారు. నీవు ఎంత గొంతు చించుకొని అరచినా అలంపూర్‌లో కాంగ్రెస్ పప్పులు ఉడకవని వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు.

## శాంతినగర్‌లో పోలీసుల కవాతు



కొంకలలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

వడ్డేపల్లి, నవంబర్ 7 : మండలంలోని కొంకల గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఎస్పీ ఆదేశాల మేరకు శాంతినగర్ పోలీసులు, ఐటీబీపీ సిబ్బంది మంగళవారం సాయంత్రం కవాతు నిర్వహిఁచారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు కవాతు చేసి అవగాహన కల్పించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎస్సై నరేష్, హెడ్ కానిస్టేబుల్ రాజవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

ఎర్రవల్లి చౌరస్తా, నవంబర్ 7 : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన మంగళవారం ఇటిక్యాల మండలం పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. జడ్చర్లకు చెందిన కుటుంబ సభ్యులు పల్లెపాడులోని తమ బంధువులను కలిసేందుకు తమ ట్రాలీఆటోలో వచ్చారు. తిరుగుప్రయాణంలో మంగళవారం ఎర్రవల్లి పదోపటాలం పెట్రోల్‌బంక్ వద్ద ట్రాలీఆటోను డీసీఎం వెనుక నుంచి అతివేగంగా వచ్చి ఢీ కొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను గద్వాల దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాదంలో గాయపడిన వెంకటేశ్, నర్సింహ, తిరుపతి, పరిస్థితి విషమంగా ఉందని బంధువులు తెలిపారు.

# ఎన్నికలపై ప్రత్యేక నిఘా..

• ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారుల కసరత్తు

అయిజ, నవంబర్ 7 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల పర్వం ప్రారంభం కావడంతో అధికారులు నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రత్యేకదృష్టి కేంద్రీకరించారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ వ్యూహం పన్నుతున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో చంద్రకళ అధికారులతో సమీక్ష జరుపుతూ నిఘాను ముమ్మరం చేస్తున్నారు. నియోజకవర్గంలోని 7 మండలాల్లో మోడల్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన కాకుండా ఉండేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ టీం, వీడియో సర్వేలెన్స్ టీం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీంల ఏర్పాటుతో పాటు నోడల్ అధికారి నేతృత్వంలో ప్రచారానికి అవసరమైన అనుమతులు మంజూరు, ఎన్నికల నిబంధనలను అమలు చేసేందుకు పక్కాగా చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన బృందాలు ఇప్పటికే నియోజకవర్గ పరిధిలోని 7 మండలాల్లో విధులు నిర్వహిస్తున్నాయి. మద్యం, డబ్బు రవాణా, పంపకాలకు అడ్డుకట్ట వేసేందుకు నిఘాను మరింత కఠినతరం చేశారు. ప్రధానంగా నియోజకవర్గం స్టాటిక్ సర్వేలెన్స్ బృందం తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదును ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి తిరిగి ఇచ్చేలా చూస్తున్నారు. మోడల్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన జరుగకుండా ఉండేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నారు. మోడల్ ఆఫ్ కండక్ట్ విషయంలో ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు అనుమతు లు, ర్యాలీలు, బహిరంగ సభల విషయంలో ఏ విధమైన సందేహాలున్నా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను సంప్రదించాలని అధికారులు పేర్కొంటున్నారు. నియోజకవర్గంలో 2,36,076 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,16,989, మహిళలు 1,19,080, ఇతరులు 7 మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలో 290 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసింది. ఈ నెల 30న ఓటింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



అలంపూర్ నియోజకవర్గ నామినేషన్ కేంద్రం

**స్టాటిక్ సర్వేలెన్స్ టీంలు..**

స్టాటిక్ సర్వేలెన్స్ టీంలు ప్రతినిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నారు. రిటర్నింగ్ అధికారి ఆదేశాల ఈ తనిఖీలు ముమ్మరం అవుతున్నాయి. నియోజకవర్గంలోని సరిహద్దు ప్రాంతాలను జల్లెడ పడుతున్నాయి. జాతీయ రహదారిపై నిఘాను కఠినతరం చేశాయి. వివిధ ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు జరుగుతున్నాయి. మోడల్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలు కాకుండా వీడియో సర్వేలెన్స్ టీంలు నిఘా ఏర్పాటు చేస్తున్నాయి.

**ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు..**

నియోజకవర్గంలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు అప్రమత్తంగా ఉంటున్నాయి. ఎక్కడ ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లు గుర్తించినా అధికారులు అక్కడికి వెళ్లి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తారు. ఎక్కడ కోడ్ ఉల్లంఘన జరిగినా సంబంధిత పరిధిలో బృందాలకు సమాచారం అందుతుంది. వెంటనే బృందాలు పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం చేరవేస్తారు.

**నిరంతర నిఘా నేత్రం..**


అసెంబ్లీ ఎన్నికల్లో పోటీలో నిలుస్తున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు నిర్వహించే సభలు, సమావేశాలపై వీడియో సర్వేలెన్స్ బృందాలతో నిఘా కొనసాగుతోంది. రాజకీయ సభలు, సమావేశాలు, ర్యాలీలు జరిగినా ఈ బృందాలు వీడియో చిత్రీకరించి ఎన్నికల కమిషన్‌కు అందిస్తుంది. సభలు, సమావేశాలు, ర్యాలీల్లో ఎంత మంది పాల్గొన్నారు, ఎన్ని వాహనాలు తరలివచ్చాయి, ద్విచక్ర వాహనాలు ఎన్ని, కార్లు, బస్సులు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు ఉన్నాయో వాటి నెంబర్లతో సహ ఈ బృందాలు వీడియో చిత్రీకరిస్తున్నాయి.

## ఆర్డీఎస్ ఆనకట్టకు పెరుగుతున్న వరద

అయిజ, నవంబర్ 7 : కర్ణాటకలోని ఆర్డీఎస్ (రాజోళి బండ డైవర్సన్ స్కీం) ఆనకట్టకు వరద పెరుగుతున్నది. గత నాలుగు రోజులుగా ఏపీ, కర్ణాటక ప్రాంతాల్లో కురుస్తున్న వానలకు ఆర్డీఎస్ ఆనకట్టకు వరద వచ్చి చేరుతోంది. దీనికి తోడు టీబీ డ్యాం నుంచి ఆర్డీఎస్ నీటి వాటాను విడుదల చేస్తుండటంతో రెండురోజుల్లో ఆనకట్టకు వరద భారీగా చేరుకునే అవకాశాలు ఉన్నాయి. తుంగభద్రా నదికి భారీగా వరద చేరితే తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం పంపులు ప్రారంభించేందుకు ఇరిగేషన్ అధికారులు సిద్ధమవుతున్నారు. మంగళవారం 3,291 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, 2,771 క్యూసెక్కులు దిగువన ఉన్న సుంకేసుల బ్యారేజీకి చేరుతున్నాయి. ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 520 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.5 అడుగుల మేర నీటి మట్టం ఉన్నట్లు ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆర్డీఎస్ నీటి వాటాలో భాగంగా మొదట నాలుగు రోజులు 1,700 క్యూసెక్కులు, 19 రోజులు వెయ్యి క్యూసెక్కుల చొప్పున 3. 230 టీఎంసీల నీటిని తుంగభద్ర డ్యాం నుంచి విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 28 వరకు నీటి విడుదల కొనసాగుతుందని వెల్లడించారు.

**టీబీ డ్యాంలో ..**

కర్ణాటకలోని తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచిపోగా, అవుట్‌ఫ్లో 10,422 క్యూసెక్కులు ఉంది. 105.788 టీఎంసీల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 27.251 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 1633 అడుగుల గరిష్ట నీటి మట్టానికి గాను, ప్రస్తుతం 1604.07 అడుగుల నీటి మట్టం ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.



టీబీ డ్యాం నుంచి తుంగభద్రా నదిలోకి చేరుతున్న నీరు

## గద్వాలలో రెండు నామినేషన్లు..

గద్వాల, నవంబర్ 7: సాధారణ ఎన్నికల్లో భాగంగా మంగళవారం రెండు నామినేషన్లు దాఖలైనట్లు అదనపు కలెక్టర్ రిటర్నింగ్ అధికారి అపూర్వచౌహాన్ తెలిపారు. ఐడీవోసీలోని రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున ధరూర్ మండలం జాంపల్లి గ్రామానికి చెందిన సుబ్బారావు, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున కేటీదొడ్డి మండలం చింతలకుంట గ్రామానికి చెందిన గొంగళ్ల రంజిత్‌కుమార్ నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారికి అందజేశారు.

**అలంపూర్‌లో రెండు..**

అలంపూర్, నవంబర్ 7 : నామినేషన్ ప్రక్రియలో భాగంగా నాలుగో రోజు రెండు దాఖలైనట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చంద్రకళ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున అయిజకు చెందిన విశ్రాంత ఎంఈవో మేరమ్మ, బీజేపీ పార్టీ తరఫున మాదన్న మంగళవారం నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ కార్యాలయంలో అందజేసినట్లు ఆమె పేర్కొన్నారు.


## నేడు డయల్ యువర్ డీఎం

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబర్ 8 : నేడు సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు డయల్ యువర్ డీఎం ఫోన్ ఇన్ కార్యక్రమం ఉంటుందని డిపో మేనేజర్ దేవరాజు మంగళవారం ప్రకటనలో తెలిపారు. కావున నాగర్‌కర్నూల్ డిపో పరిధిలో ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదే విధంగా డిపో అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలని తెలిపారు.

## మహిళలకు వైద్యపరీక్షలు

మానవపాడు, నవంబర్ 7 : ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్యపరీక్షలు చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ రకాల అనారోగ్యాలతో వచ్చిన 61 మంది మహిళలకు డాక్టర్ రిజ్వాన వైద్యపరీక్షలు నిర్వహించారు. రక్తహీనత, క్యాన్సర్, షుగర్ పరీక్షలు చేశారు. అనంతరం డాక్టర్ రిజ్వాన ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. గర్భిణులకు మహిళను ప్రభుత్వ ఆసుపత్రిల్లో ప్రసవం చేయించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సత్యనారాయణ, చంద్రన్న, సంధ్యారాణి, తిరుమల్‌రావు, ఆయా గ్రామాల ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మాజీసర్పంచ్ మృతి..



ఎర్ర బీసన్న

ఎర్రవల్లి చౌరస్తా, నవంబర్ 7 : అనారోగ్యంతో మాజీసర్పంచ్ మృతి చెందిన ఘటన ఎర్రవల్లి మండలంలో చోటుచేసుకున్నది. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఎర్రబీసన్న రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదటి సర్పంచ్‌గా బీఆర్ఎస్ నుంచి ఎన్నుకున్నారు. కొన్ని రోజులుగా అనా రోగ్యంతో బాధపడుతున్న ఎర్ర బీసన్న సోమవారం రాత్రి మృతి చెందాడు. బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు నివాళులర్పించి సంతాపం తెలిపారు.

## మద్యం బాటిళ్లు పట్టివేత

వడ్డేపల్లి, నవంబర్ 7 : శాంతినగర్‌లో తనిఖీలో భాగంగా మద్యం బాటిళ్లు పట్టుకున్నారు. సోమవారం రాత్రి వాహనాలను ఎస్సై నరేష్ తనిఖీ చేస్తుండగా జూలేకల్ గ్రామానికి చెందిన గోవర్ధన్ నుంచి రూ.47వేల విలువచేసే 43 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేశామని వారు తెలిపారు.